విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు

పాఠశాలలు తెరిచేనాటికి నాడు-నేడు పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-చాట్రాయి: అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం చాట్రాయి మండలంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేసి మండల, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులు నిర్ధిష్టకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చాట్రాయి మండలంలోని పోలవరం గ్రామంలో యంపి నిధులతో నిర్మించిన బహుళార్ధకసాధక భవనాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎలక్ట్రికల్‌కు సంబంధించిన పనులు నిర్వహించకపోవడంపై సంబంధిత పంచాయతీరాజ్ ఎఇ, ఇంజనీర్ అసిస్టెంట్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం చాట్రాయి గ్రామంలో మండల పరిషత్ ప్రాధమిక పాఠశాలలో నాడు-నేడు పథకం కింద జరుగుతున్న ఆధునీకరణ పనులను కలెక్టర్ తనిఖీచేశారు. పాఠశాల తరగతిగదులు, ఎలక్ట్రిఫికేషన్, మరుగుదొడ్లు, ఫర్నీచర్, ఆర్వోప్లాంట్, ఇతర మరమ్మత్తు పనుల పురోగతిని పరిశీలించి అధికారులనుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల తెరచే నాటికి తప్పనిసరిగా నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రక్కన ఉన్న శిధిలమైన పాఠశాలను తొలగించమని తహశీల్దారును అదేశించారు. అనంతరం అదే గ్రామంలో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఏవిధంగా సహాయక చర్యలు, తీసుకోవలసిన చర్యలపై డెమోను కలెక్టర్ వీక్షించారు. నరసింహారావుపాలెంలోని గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి నోటీస్ బోర్డ్ లో ఉంచిన ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల లబ్దిదారుల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. హౌసింగ్ ద్వారా జగనన్న కాలనీకి సంబంధించిన పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అసిస్టెంట్ ను అడిగి తెలుసుకున్నారు. చనుబండ గ్రామంలో అమృత సరోవర్ పథకం ద్వారా చేపట్టిన చెరువును కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ విశ్వనాథరావు, యంపిడిఓ కె. దుర్గాప్రసాద్, ఎపిఓ జి. లక్ష్మీకుమారి, ఈవోపిఆర్డి నాగరాజు, సర్పంచ్ జ్యోతి, స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జి. రాము, యంపిడిఓ కార్యాలయ ఎఓ ఎస్. మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు క్రీడా స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించండి

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-నూజివీడు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధిలో భాగంగా క్రీడా స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూజివీడులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల సమీపంలో గల క్రీడా స్థలాన్ని స్టేడియంగా నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించడానికి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్‌తో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో స్టేడియంకు సంబంధించిన ప్రహరి, హద్దులు, తదితర సమాచారాన్ని మ్యాప్ ద్వారా తహశీల్దార్ డివిఎస్ ఎల్లారావు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మామిడి పరిశోధనా కేంద్రం ప్రక్కన ఉన్న 40 ఎకరాల ప్రైవేటు భూమిని మధ్యతరగతి ప్రజలకు స్థలాలు కేటాయించడానికి కొనుగోలు చేసిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి ఈ స్థల సరిహద్దుల్లో ఉన్న స్థలాల వివరాలు, ప్రభుత్వ స్థల రేటును రెవిన్యూ అధికారును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిద్ధార్థ నగర్ లో కొండపై శిధిలమై ఉన్న రెవిన్యూ విశ్రాంతి భవనాన్ని కలెక్టర్ పరిశీలించి ఈ భవనాన్ని పునఃప్రారంభించడానికి ప్రతిపాదనలు రూపొందించి చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో యంపిడివో ఖాన్, ఆర్.ఐ. అశోక్ కుమార్, విఆర్ఓ రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు అభివృద్ధికి కృషి చేస్తాం

విశాలాంధ్ర -కైకలూరు : కైకలూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిధిగా శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకట రమణ కలిసి పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు తమదృష్టికి వచ్చిన పనులను ఏ విధంగా పరిష్కరిస్తున్నామో ఆ పనులను ప్రజా ప్రతినిధులకు తెలియచేశారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే డిఎన్ఆర్ మాట్లాడుతూ కైకలూరు మండలంకు గాను సుమారుగా 2 కోట్ల పై బడి నిధులు తీసుకువచ్చి పనులు మొదలుపెట్టమంటే ఇంకా చాలా వరకు పనులు మొదలు పెట్టలేదు. మీకు ఎమైనా సమస్యలు ఉంటే వెంటనే చెప్పండి అని వీలైనంత త్వరగా 2 లేక 3 రోజులో పనులను మొదలుపెట్టాలని సూచించారు. ఆక్వా రైతుల సబ్సిడీ గురించి మాట్లాడుతూ అర్హత ఉండి కూడా సబ్సిడీ పొందలేని రైతులు ఉండకూడ దని అటువంటి వారు ఎవరైనా ఉంటే దానికి అధికారులే బాధ్యత వహించాలని తెలియచేశారు. అనంతరం శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయ పరచు కుంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ కూరెళ్ల బేబీ, కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, మండల పార్టీ అధ్యక్షులు, తామరకొల్లు సర్పంచ్ భట్రాజు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలలో ప్రాతినిధ్యం కల్పించే వారికే మద్దతు

విశాలాంధ్ర-ఏలూరు: చట్టసభల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించేవారికే మద్దతు ఇస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌భాషా సంఘం అధ్యక్షులు కె. పీర్ మహ్మద్ తెలిపారు. ఏలూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 18 లక్షల నుంచి 22 లక్షల మంది వరకు తమ కులస్తులు వున్నారని చెప్పారు. ఇప్పటి వరకు ప్రతిపక్షం, అధికారపక్షం, చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. ప్రతి జిల్లాలో సమావేశాలు పెట్టి తమ సత్తా చాటుతామని, తమకు ఎవరైతే చట్టసభల్లో అవకాశం కల్పిస్తారో వారి వెంటే వుంటామని స్పష్టం చేశారు. జులై రెండో తేదీన భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌ను నేరుగా కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. తమ కులస్తులకు ప్రతి రాయితీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా త్వరలో 15 వేల మందికి పైగా ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డి. మస్తానమ్మ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టిల కంటే తమ దుస్థితి దీనంగా ఉందన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సలీం, గుంటూరు జిల్లా అధ్యక్షులు కె. మహ్మద్ ఖాజా వలి, తిరుపతి జిల్లా అధ్యక్షులు కరీముల్లా వలి, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు సిద్ధయ్య, గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ నాగూర్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బాజీ సైదా, పశ్చిమ గోదావరి జిల్లా యువజన సంఘ అధ్యక్షులు షేక్ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు సిగ్గుమాలిన చర్య

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-పాలకొల్లు: చించినాడ పెరుగులంక భూముల్లో మట్టిని జగనన్న గృహాల నిర్మాణానికి తరలిస్తున్నామని చెపుతూ ఇటుక బట్టీలకు మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడం అంతటి సిగ్గు మాలిన చర్య మరొకటి వుండదని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు, దోపిడీకి అద్దం పడుతుందని తీవ్రంగా దుయ్యబట్టారు. శుక్రవారం మేడ పాడులో దళితులు సాగు చేసుకుంటున్న పెరుగులంక భూముల్లో అక్రమ మట్టి త్రవ్వకాలు జరుపుతూ ఆ మట్టిని మేడపాడులో ఇటుక బట్టీలకు తరలించిన సందర్భంలో ఇటుక బట్టీవద్ద మట్టి లారీని నిలిపి దళితులు చేస్తున్న ఆందోళనలో భీమారావు పాల్గొని మాట్లాడుతూ గతంలో మునుపెన్నడూ ఇంత సిగ్గు మాలిన దోపిడీ చూడలేదన్నారు. జగనన్న కాలనీల నిర్మాణానికి మట్టిని తరలిస్తున్నామని చెపుతూ ఇటుక బట్టీలకు మట్టిని తరలించి సొమ్ము చేసుకోవడం దారుణమన్నారు. దళితుల సంక్షేమమే తమ లక్ష్యం అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు 70 సంవత్సరాలుగా చించినాడలో 60 ఎకరాల పెరుగులంక భూముల్లో 400 మంది దళిత కుటుంబాలు బి.ఫారం పట్టాలు పొంది సాగుచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న దళితుల భూముల్లో మట్టి త్రవ్వకాలు జరిపి భూములు సేద్యానికి పనికిరాకుండా చేయడమే దళిత సంక్షేమమా అని భీమారావు ప్రశ్నించారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం స్టే ఉత్తర్వులు పట్టించుకో కుండా, నదీ పరివాహక ప్రాంతంలో 200 అడుగులలోపు ఎలాంటి త్రవ్వకాలు జరుపరాదనే పర్యావరణ నిబంధనలు తుంగలో త్రొక్కి దళితుల కడుపులు కొట్టి అక్రమ మట్టి త్రవ్వకాలు జరపడం అన్యాయమన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో దళితులు చేస్తున్న న్యాయ పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలుపు తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి దళితులపట్ల చిత్తశుద్ధి వుంటే దళితుల భూముల్లో అక్రమ మట్టి త్రవ్వకాలు నిలిపివేయాలని, ఇంతవరకు మట్టిని త్రవ్వి గుంటలు పెట్టిన వాటికి నష్ట పరిహారం చెల్లించి తమ చిత్తశుద్ధి నిరూపించు కోవాలని భీమారావు డిమాండ్ చేశారు.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సుందర్, ఎఐవైఎఫ్ జిల్లా నాయకుడు పవన్ ,ఆర్. మణిదీప్, పి.కుమార్, టి.రాం ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన కూలి రేట్లు సాధించుకున్న హమాలీ కార్మికులు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరులోని వివిధ షాపులలో పనిచేసే హమాలీ కార్మికులకు 15 శాతం కూలి రేట్లు పెంచుతూ ఒప్పందం సాధించుకున్నారు. శుక్రవారం ఏలూరు మర్చంట్ చాంబర్ వారి మధ్య వర్తిత్వంలో వ్యాపారస్తులకు కార్మిక సంఘాలకు మధ్య జరిగిన చర్చలలో ఈ మేరకు ఒప్పందం కుదిరిందని ఏఐటీయూసీ, ఐ.ఎఫ్.టి.యు. నాయకులు తెలియజేశారు. గతంలో జరిగిన కూలిరేట్ల ఒప్పందం ఏప్రిల్ 9వ తేదీతో ముగిసింది. అంతకుముందే ఏఐటియుసి అనుబంధ జట్లు, లాగుడు బండ్ల కార్మిక సంఘం,ఐ.ఎఫ్.టి.యు.అనుబంధ ఏలూరు హమాలీ, జట్టు కార్మిక సంఘం విడివిడిగా ఛాంబర్ నాయకత్వానికి నోటీసులు ఇచ్చారు. చాంబర్ నాయకత్వం జాయింట్ సమావేశం ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేయటంతో కార్మికులు యజమానుల షాపుల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనితో చాంబర్ పెద్దలు అత్యవసరంగా సమావేశం నిర్వహించారు. రెండు దఫాలుగా చర్చలు జరిగాయి. శుక్రవారం ఇరువర్గాల మధ్య జరిగిన చర్చలలో ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ఇస్తున్న కూలి రేట్లపైన 15 శాతం పెంపుదల చేయుటకు ఇరువర్గాలు అంగీకరించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నాయకులు పి.కన్నబాబు, ఐ.ఎఫ్.టి.యు.నాయకులు గడసాల రాంబాబు మాట్లాడుతూ మొదట ఆలస్యం చేసినప్పటికీ చివరికి యజమానులు సామరస్యంగా ఒప్పందానికి ముందుకు వచ్చారని తెలియజేశారు. ఈ ఒప్పందం సాధించుకోవడంలో పట్టుదల ప్రదర్శించిన ఇరు సంఘాల కార్మిక వర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్మికులు సంఘటితంగా, ఐక్యంగా ఉండబట్టే ఈ మేరకు ఫలితం సాధించుకున్నామని వారు ప్రకటించారు. ఈ చర్చలో ఛాంబర్ తరఫున అధ్యక్షులు నేరెళ్ల రాజేంద్ర, ఉపాధ్యక్షులు దింటకుర్తి వీర్రాజు, సెక్రటరీ వంకాయల రామకృష్ణ, వ్యాపారస్తులు బుర్రంశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొనగా, కార్మికుల తరఫున ఏఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, నాయకులు మారిన వెంకట్రావు, పుప్పాల కన్నబాబు, అనుబంధ జట్లు లాగుడు బండ్ల కార్మిక సంఘం (ఏఐటియుసి) కార్యదర్శి గంగరాజు, కోశాధికారి పెచ్చెట్టి శ్రీను,ఐ.ఎఫ్.టి.యు. నాయకులు యు వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు,ఇఫ్టూ అనుబంధ ఏలూరు హమాలీ జట్టు కార్మిక సంఘం అధ్యక్షులు జగ్గపు వెంకటరమణ, కార్యదర్శి గడసాల రాంబాబు, ఉపాధ్యక్షులు సందక అప్పారావు, కోశాధికారి మంగం అప్పారావు,ఇరు సంఘాల నాయకులు తుమ్మల ఈశ్వరరావు, అన్నవరం, జి.నాగేశ్వరావు, జి.జనార్ధన్, గొర్రెల అప్పారావు, కరుణ సురేష్, పి. నూకరాజు, తాండ్రంగి సాయి,ఎస్ రాంబాబు,కె. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర -కొయ్యలగూడెం : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పరింపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయకుమారి పేర్కొన్నారు. సమైక్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం సర్పంచ్ విజయ కుమారి, వైసీపీ సీనియర్ నాయకులు తాడికొండ మురళీకృష్ణ, ముప్పిడి చినబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ కుమారి మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడవకుండా క్రీడా పోటీలలో పాల్గొనడంతో శరీర వ్యాయామానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆమె తెలిపారు. తాడికొండ మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే క్రీడా పోటీలలో యువత పాల్గొని, తమ ప్రతిభను కనబరిచి అత్యధిక ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 25వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, అందజేయడం జరుగుతుందని సమైక్య యూత్ అధ్యక్షుడు గంగిరెడ్ల సతీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమైక్య యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వలంటీరును కొట్టి, బెదిరించిన వ్యక్తిపై కేసు

విశాలాంధ్ర-టి నరసాపురం: వలంటీర్ ను కొట్టి అంతుచూస్తానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ఐ కె సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టి నరసాపురంలో వాలంటీర్ గా పని చేస్తున్న రాయల రాధాకుమారి గురువారం రాత్రి వైఎస్ ఆర్ భీమా పథకం రెన్యువల్ చేయడానికి తన పుట్టింటికి వెళ్లి తన తండ్రి చేత వేలిముద్ర వేయిస్తూ విధినిర్వహణలో వుండగా అక్కడే ఉన్న తాడిగడప నాగేశ్వరరావు పొలం విషయంలో వలంటీరుతో గొడవ పడి కొట్టి నీ అంతుచూస్తానని బెదిరించినట్లు రాధా కుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

24వ రోజుకు చేరిన మొబైల్ మజ్జిగ చలివేంద్రం

విశాలాంధ్ర-ఉంగుటూరు: వేసవి తాపాన్ని తగ్గించేందుకు ప్రజల ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ చైర్మన్ ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ పత్సమట్ల ధర్మరాజు గతనెల 17వ తేదీ నుంచి మొబైల్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో బస్టాండ్లో నిల్చున్న ప్రయాణికుల వద్దకు మొబైల్ ద్వారా వచ్చి మజ్జిగ అందజేస్తున్నారు .24వ రోజు శుక్రవారం నారాయణపురం లో ప్రారంభమై నాచుగుంట, వెల్లమిల్లి, బాదంపూడి గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు, పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో ఈ మొబైల్ ద్వారా అందరికీ మజ్జిగ సరఫరా చేస్తున్నామన్నారు.

స్వీపర్, ఆయాలను ఉద్యోగులుగా గుర్తించాలి

- ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-చింతలపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్, ఆయాలను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటియుసి చింతలపూడి ఏరియా కార్య దర్శి కంకిపాటి బుచ్చిబాబు, అధ్యక్షులు తొర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీవో కి ఏఐటియుసి మండల కమిటీ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కంకిపాటి బుచ్చిబాబు, తొర్లపాటి బాబు మాట్లాడుతూ చింతలపూడి 2015 సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్, ఆయాలుగా ఉదయం గం.8 నుండి సాయంత్రం గం.4 వరకు పాఠశాలల్లో బాత్రూములు శుభ్రం చేస్తూ పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి కనీస భద్రత లేకుండా చాకిరి చేయించుకుంటూ ఆస్పత్రికి వెళ్లాలన్నా సెలవు దొరకదని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవు దినాలలో కూడా పాఠశాల ప్రతిరోజు ఊడ్చి శుభ్రపరిచే వారికి పూర్తి జీతం ఇవ్వాలని, హై స్కూల్స్ లో పనిచేసే వారికి మరుగుదొడ్లు 10, 14 ఉండటం వలన పని భారం ఎక్కువై ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి100 మందికి ఒక ఆయాను నియమించాలన్నారు. రద్దు కాబడిన స్కూల్లో పనిచేసిన ఆయాలను వేరే స్కూల్లో ఆ పోస్ట్ భర్తీ చేయాలన్నారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆప్షనల్ సెలవు ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని కింద స్థాయి పాఠశాలలో కూడా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్నమ్మ, జ్యోతి, బూసమ్మ, లక్ష్మి, రూతమ్మ, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయు ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర -భీమవరం: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కారం కోసం ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసం బలమైన ఉద్యమాలు నిర్మించిన చరిత్ర ఎస్టీయు దేనని ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ అన్నారు. ఎస్టీయు 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం భీమవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ బతకలేని బడి పంతులు స్థాయి నుండి నేటి స్థాయి వరకు ఎస్టీయు ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. విద్యా రంగాన్ని భ్రష్టు పట్టిస్తున్న జీఓ 117ను రద్దు రద్దు కోసం, సిపిఎస్ రద్దు కోసం, 12వ పీఆర్సీ కోసం, గత పీఆర్సీ బకాయిల కోసం ఎస్టీయు అలుపెరుగని ఉద్యమాలు నిర్వహిస్తుందని ఆయన గుర్తుచేశారు. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించడం సిగ్గుచేటని మనం మరిన్ని ఆత్మ గౌరవ పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత ఎస్టీయు జెండాను పి.ఎస్.ప్రతాపరాజు ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బాలా కుమారి, జిల్లా అధ్యక్షుడు జవహర్ లాల్ రాజు, నాయకులు ప్రతాపరాజు, చుండూరి ప్రసాద్, బి.పాండురంగారావు, జోసఫ్ రాజు, మహంకాళి, దగ్గుమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

గరగపర్రురోడ్డు బాధితులకు అండగా నిలుస్తాం

విశాలాంధ్ర -భీమవరం: గరగపర్రు రోడ్డులో ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన ప్రజలకు అండగా నిలిచి ఉంటామని, బాధితులకు నష్టపరిహారం చెల్లించి ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గరగపర్రురోడ్డు బాధితులకు సంఘీభావంగా శుక్రవారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా నివాసం ఉన్న దళితులు ఇళ్లను ఏ నోటీసు ఇవ్వకుండా అన్యాయంగా తొలగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు నిర్మాణం చేసుకుంటే మంది మార్బలంతో తెల్లవారుజామునే వచ్చి ఇళ్లు కూల్చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉంటుందని చెల్లబోయిన హామీ ఇచ్చారు. సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల చంద్రశేఖర్, టిడిపి నాయకులు ఐజాక్ బాబు, సిపిఎం పట్టణ కార్యదర్శి బి. వాసుదేవరావు, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు డి.శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు త్రిమూర్తులు, ఆంజనేయులు, టిడిపి నాయకులు కె.శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా సోడే కన్నారావు

విశాలాంధ్ర - వేలేరుపాడు : శివకాశిపురం సిపిఐ శాఖ నూతన కార్యదర్శిగా సోడే కన్నారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మచ్చ చందర్రావు అధ్యక్షతన శివకాశిపురంలో శుక్రవారం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బాడిశ రాము మాట్లాడుతూ ఈ శాఖ కార్యదర్శిగా పనిచేసిన కట్టి గోపాలరావు గుండెపోటుతో చనిపోవడం చాలా బాధాకరమన్నారు. పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనే వ్యక్తి చనిపోవడం పార్టీకి తీరనిలోటన్నారు. ఆయన స్థానంలో శాఖ నూతన కార్యదర్శి సోడే కన్నారావు, సహాయ కార్యదర్శిగా మచ్చ చందర్రావు, మహేష్ వీరితోపాటు తొమ్మిది మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ నెల 12 నుండి 26వ వరకు పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికై చేపట్టిన జీపు జాత కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కుక్కునూరు మండలంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జీపు జాత ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలేరుపాడు మండలం నుండి అధిక సంఖ్యలో నిర్వాసితులు తరలి రావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లీ సాయిబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర మధు, సోడే నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

30లోగా నారుమడులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: ఈ సార్వా వరి పంటలకు జూన్ 30వ తేదీ లోగా రైతులు నారు మడులు పూర్తి చేయాలని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి. మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం గణపవరం మండల వ్యవసాయ సలహా బోర్డు సమావేశం సలహా బోర్డు చైర్మన్ కూచంపూడి జగపతిరాజు, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆధ్వర్యంలో సరిపల్లె రైతు భరోసా కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏడిఏ పాల్గొని మాట్లాడుతూ సార్వ 2023 సీజన్ కి అనువైన వంగడాలు ఎంటియు - 7029,ఎంటియు -1318, రకాల వంగడాలను వాడుకోవచ్చు అన్నారు. 2023-24 సంవత్సరానికి గాను కౌలు రైతులు అందరూ పంట సాగు హక్కు పత్రాలను (సిసిఆర్ సి) తీసుకోవాలని దీని ద్వారా వచ్చే లబ్ధి పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గణపవరం తహసీల్దారు పమ్మి లక్ష్మి, వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

విశాలాంధ్ర - గణపవరం: జనసేన పార్టీలో గణపవరం మండలం సరిపల్లె యువకులు, గ్రామ పెద్దలు భారీగా చేరారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు ,పార్టీ సిద్ధాంతాలు ఉంగుటూరు జనసేన పార్టీ ఇన్ చార్జి పత్సమట్ల ధర్మరాజు చేసే సేవా కార్యక్రమాలు నచ్చి సరిపిల్లె యువకులు 100 మందికి పైగా జనసేన పార్టీలో చేరినట్లు పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. వారికి కండువా వేసి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గవరలక్ష్మి ,జిల్లా కార్యదర్శి జి. రవి, సంయుక్త కార్యదర్శి జి. రత్తయ్య సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తోట శీను, తోట పవన్, ఆకుల నారాయణ, వట్టి పులుసు రామాంజనేయులు, వెంపాటి పెద్దిరాజు, కారంపూడి నాగకృష్ణ, ఆచంట వేంకటేశ్వర రావు, కొండా రాము, ముంగర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఫ్యామిలీ ఫిజీషియన్ వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముగ్గుళ్ళ గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వైద్యాధికారిణి డాక్టర్ పి. కిరణ్మయి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ ఫిజీషియన్‌లో బిపి, షుగర్ గర్భిణీలను బాలింతలను, కిషోర్ బాలికలను, పరీక్షించి వారికి ఉచితంగా మందులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి నెల ఈ క్యాంపు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశం సద్వినియోగము చేసుకోవాలని, 67 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జె. విల్సన్ బాబు, హెల్త్ ప్రొవైడర్ ఇ. కమల, ఏఎన్ఎం పుష్పకాంతం, హెల్త్ అసిస్టెంట్ ఎం. ముసలయ్య, ఎ. కృష్ణ, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు చేరువగా సంక్షేమ పాలన

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్రంలో సంక్షేమ పరిపాలనను అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేసినట్టు ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నిడమర్రు గ్రామంలో 165 వ రోజు గడపగడపకు -మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గడప గడపకు ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ,ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ వాసుబాబు వ్యక్తిగతంగా అందచేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రతి కుటుంబానికి తీసుకువెళ్ళి సంక్షేమ పథకాలు ప్రజల గడపకు చేరుస్తున్నామని అన్నారు. ఈ 4 సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల బ్రోచర్స్ ను ప్రజలకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొట్నూరి ఉమామహేశ్వరరావు, జడ్పిటిసి సభ్యులు కోడే కాశీ, ఎంపీపీ దనుకొండ ఆదిలక్ష్మి, వైఎస్ఆర్ పార్టీ మండల కన్వీనర్ సంకు సత్య కుమార్, మండా పోలయ్య, వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు అభినందనలు

విశాలాంధ్ర-మండవల్లి: పదోన్నతులు, బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చిన అధికారులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండవల్లి తహసీల్దారుగా వచ్చిన కె.రాజ్ కుమార్, ఎంపిడివోగా వచ్చిన టికె.రమణలను వారి కార్యాలయాల్లో ఐక్యవేదిక నేతలు శుక్రవారం కలిసి మండలాభివృద్ధికి పాడుపడాలని కోరారు. స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని గ్రామసభలకు అధికారులందరు హాజరయ్యేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐక్యవేదిక నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు, తెంటు అప్పారావు, సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సూదా బత్తుల విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

12 నుంచి గురుకుల పాఠశాలలో ప్రవేశాలు

విశాలాంధ్ర-టి నరసాపురం: గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 12వ తేదీ నుండి ప్రవేశం కల్పించనున్నట్లు అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి. నరసింహా స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి సీట్లకు, 6,7,8 తరగతుల్లో మిగిలివున్న సీట్లకు,గురుకుల జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ సీట్లకు, జనరల్ గురుకుల డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం డిగ్రీ సీట్లకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశము కొరకు మే నెల 20 వ తేదీన నిర్వహించ బడిన ప్రవేశ పరీక్ష ఫలితాలు ఈ నెల 8వ తేదీన విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

శాఖ గ్రంథాలయంలో పుస్తక సమీక్ష పోటీలు

విశాలాంధ్ర -భీమవరం: శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం పుస్తక పఠనం, కథలు చెప్పడం, యోగ, నృత్యంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం జరిగిన పుస్తక సమీక్ష పై పోటీలను విశ్రాంతి తెలుగు ఉపాధ్యాయులు రామ నాగేశ్వరరావు పర్యవేక్షిం చారు. శనివారం నృత్యంపై పోటీలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సంఘసేవకులు చెరుకువాడ రంగశాయి, లక్ష్మి, పద్మ, శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణీలకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర -కైకలూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీతనపల్లిలో ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం వైద్యాధికారిని బి. హేమలత ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యంగా రెండవ, మూడవ త్రై మాసికం గర్భిణీలకు పరీక్షలు 50 మందికి చేసారు. వీరిలో ఏడుగురు ని హై రిస్క్ గర్భిణీ లు గా గుర్తించి ప్రతి గర్భిణీ కి ఐరన్ ఫోలిక్ ఆసిడ్, కాల్షియమ్ సప్లిమెంట్స్ అందించారు. ఈ కార్యక్రమంకు వచ్చిన గర్భిణీ లకు మరియు గర్భిణీ ల సహాయ కులకు శ్రీ సత్య సాయి సేవా సంఘం కైకలూరు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ,సిబ్బంది , మూర్తి, శ్రీనివాసరావు,కనకదుర్గ, లక్ష్మి కుమారి సత్య సాయి సమితి వీరప్ప, విజయలక్ష్మి, రాధాకృష్ణ, సత్యవతి, జూన్సీ, సాయిప్రియ, గోపి, కృష్ణమోహన్, చలపతి పాల్గొన్నారు.